ఎన్నేళ్లైనా ఇంతేనా?

- సమస్య వలయంలో చుక్కాపూర్
- అధ్వానంగా లింక్‌రోడ్లు
- రహదారి కోసం ఎదురుచూపు
- నాయకుల హామీలే తప్ప అమలు శూన్యం



తలకొండపల్లి: ప్రభుత్వాలు మారి ప్రజాప్రతినిధులు మారుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు మాత్రం నెరవేరడం లేదు. ఏ గ్రామానికి వెళ్లినా మౌలిక సౌకర్యాల కల్పన లేమి ప్రధాన సమస్యగా మారింది. మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామం పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. మెరుగైన రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు లింక్‌రోడ్లు బీటీకి నోచుకోలేదు. ఫలితంగా సరైన రోడ్డు మార్గం లేక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. అలాగే పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు శిథిలమయ్యాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

బీటీకి నోచుకోని లింకురోడ్లు

గ్రామంలోని రేకులబావి- యడవల్లి, చుక్కాపూర్-గద్దగుండ్లతండా, యడవల్లి-చెన్నారం లింకు మట్టి రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఎగుడు, దిగుడు రోడ్లతో వాహనచోదకులు ఇక్కట్లు పడుతున్నారు. గుంతలమయమైన రోడ్లతో తరుచుగా ప్రమాదాల బారినపడుతున్నారు. లింక్ రోడ్లకు బీటీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శిథిలావస్థలో ఉన్నత పాఠశాల

ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నేటికి ఏలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. స్కూల్‌కు వెళ్లాలంటనే విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులకు విజ్ఞప్తి



గ్రామ సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశాం. గుంతమయమైన రోడ్లతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి లింక్‌రోడ్లకు బీటీ ఏర్పాటు చేయాలి

దాసరి కిష్టమ్మ, సర్పంచ్, చుక్కాపూర్

అడుగడుగునా బందోబస్తు


సీఎం కాన్వాయ్

- సీఎం పర్యటన నేపథ్యంలో ఆంక్షలు
- ప్రయాణికులకు తిప్పలు
- దుకాణాలు మూయించిన పోలీసులు
- కేసీఆర్‌ను చూసేందుకు ఎగబడ్డ జనం

ఆమనగల్లు: కొల్లాపూర్‌లో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభించేందుకు హైదరాబాద్ నుంచి కొల్లాపూర్‌కు రోడ్డు మార్గం ద్వారా సీఎం కేసీఆర్ వెళ్లారు. అయితే సీఎం పర్యటన నేపథ్యంలో ఆమనగల్లు మండలంలో జాతీయ రహదారిపై అడుగడుగునా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒకరోజు ముందే పోలీసులు సీఎం పర్యటన సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ మేరకు జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. ఆమనగల్లు పట్టణంలో ముందస్తుగా దుకాణాలు మూసివేయించారు. కేసీఆర్‌ను చూసేందుకు ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిల్చున్నారు. కేసీఆర్ బస్సులో నుంచే ప్రజలకు అభివాదం చేశారు. సీఎం వెంట మంత్రి శ్రీనివాస్‌గౌడ్, నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

కడ్తాల్: పాలమూర్- రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ సమీపంలో నార్లాపూర్ లిఫ్ట్‌ను ప్రారంభించేందుకు శనివారం మధ్యాహ్నం శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారి మీదుగా రోడ్డు మార్గంలో సీఎం కేసీఆర్ వెళ్తుండడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం ప్రయాణిస్తున్న మార్గంలో ఎవరూ అడ్డుపడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కేసీఆర్ ప్రయాణిస్తున్న మార్గంలో రోడ్డు ఇరువైపులా దుకాణాలను మూసివేయించారు. కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేస్తూ సీఎం వెళ్లారు. కేసీఆర్ వెళుతున్న సమయంలో అభిమానులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు జై కేసీఆర్, జై తెలంగాణ అని నినాదాలు చేశారు. కేసీఆర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సీఎం పర్యటన సాఫీగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

కరువు నేలపై సిరులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- పాలమూరు -రంగారెడ్డితో ఉమ్మడి జిల్లాలు సస్యశ్యామలం
- ప్రతి ఎకరాకు కృష్ణా జలాలు
- అపర భగీరథుడు కేసీఆర్
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: పాలమూర్- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుతో ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలు సస్యశ్యామలమవుతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సీఎం కేసీఆర్ పాలమూర్- రంగారెడ్డి ప్రాజెక్టు, నార్లాపూర్ లిఫ్ట్ పనులు ప్రారంభించనున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు శనివారం మండల కేంద్రం నుంచి భారీగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పాలమూర్ - రంగారెడ్డి ప్రాజెక్టు అందుబాటులోకి రానుండటంతో కరువు నేలపై సిరులు పండనున్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు, రంగారెడ్డి జిల్లాలు మరో కోనసీమగా మారనున్నాయని జోస్యం చెప్పారు. ప్రతి ఏకరాకు కృష్ణా జలాలు అందుతాయని అన్నారు. తాగునీటి సమస్య కూడా తీరనుందని తెలిపారు. ఉమ్మడి పాలమూర్ జిల్లాలో 10 లక్షల ఏకరాలకు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలో 2.30 లక్షల ఏకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. అలాగే కల్వకుర్తి నియోజకవర్గంలో 1.25 లక్షల ఎకరాలకు సాగు నీరు అందనుందని తెలిపారు. సీఎం కేసీఆర్ అపర భగీరథుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, వైస్ ఎంపీపీ ఆనంద్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, గోపాల్, మంజుల చంద్రమౌళి, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు సులోచన, ఉప సర్పంచ్ రామకృష్ణ, శ్రీనివాస్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.


యాచారంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు

ఎర్రజెండా పేదలకు అండ

సీపీఎం నాయకుడు మధుసూదన్‌రెడ్డి

యాచారం: ఎర్రజెండా నీడలోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శనివారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో యాచారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రజెండా నీడలోనే భూమి కోసం, భుక్తి కోసం పేదలు పోరాటాలు చేసి తమ హక్కులను సాధించుకున్నారని గుర్తుచేశారు. సాయుధ పోరాటం ద్వారా సాధించుకున్న భూములను నేడు కేసీఆర్ సర్కార్ బలవంతంగా తీసుకుంటోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి నర్సింహ, జిల్లా కమిటీ సభ్యుడు అంజయ్య, నాయకులు జంగయ్య, అరుణ, చందునాయక్, జంగయ్య, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ వెళ్లిన గులాబీ శ్రేణులు

ఆమనగల్లు: కొల్లాపూర్ సమీపంలోని నార్లాపూర్ వద్ద జరిగిన సీఎం కేసీఆర్ సభకు ఆమనగల్లు మండలం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివెళ్లారు. ఆమనగల్లు మండలం నుంచి దాదాపు 30 బస్సులలో ప్రజలను తరలించారు. సభకు వెళ్లిన వారిలో ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్, స్థానిక నాయకులు గుత్తి బాలస్వామి, జహంగీర్, శివకుమార్, రమేశ్, వడ్డె వెంకటేశ్, బీమయ్య, పూసల సత్యం తదితరులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం: కొల్లాపూర్ సింగోటం చౌరస్తాలో శనివారం సాయంత్రం నిర్వహించిన సీఎం కేసీఆర్ సభకు ఇబ్రహీంపట్నం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు బస్సుల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రజలతో కలిసి బస్సులోనే బయలేర్దారు.

సీఎం సభకు తరలిన నాయకులు

తుర్కయంజాల్: పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణానీటిని పాలమూరు జిల్లాకు అందించి సీఎం కేసీఆర్ మాట నిలబెట్టుకున్నారని డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు లక్ష్మారెడ్డి కొనియాడారు. శనివారం ప్రాజెక్ట్ వెట్ రన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని తుర్కయంజాల్ నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్ నాయక్, సహకార సంఘం డైరక్టర్ సంజీవ రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, అమరేందర్ రెడ్డి, వెంకటేశ్, సాదు శ్రీనివాస్, మోహన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


కొల్లాపూర్ బయలుదేరిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

అర్ధరాత్రి వరకు ఆందోళన

యాచారం: చింతుల్ల గ్రామంలో చిన్నారి మృతిపై శుక్రవారం అర్ధరాత్రి వరకు గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. టీఆర్ఆర్ స్కూల్ బస్సు ఢీ కొనడంతో శివానంద్, జ్యోతి దంపతుల కుమార్తె చిన్నారి మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను అరెస్టు చేయాలని, స్కూల్ యజమాన్యం బాధిత కుటుంబానికి పరిహారం ఇవ్వాలని గ్రామస్తులు ఆందోళన చేశారు. రాత్రి 10 గంటలు దాటినా గ్రామస్తులు ఆందోళన కొనసాగించారు. సీఐ సైదయ్య స్కూల్ యజమాన్యంతో మాట్లాడి గ్రామస్తులతో చర్చలు జరిగేలా కృషి చేశారు. సీఐ హామీతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. టీఆర్ఆర్ స్కూల్ యజమాన్యం నుంచి ప్రైవేట్ స్కూల్ యజమాన్య ప్రతినిధులు వచ్చి గ్రామంలోని ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపారు. దీంతో గ్రామస్తులు శాంతించడంతో శుక్రవారం అర్ధరాత్రి చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం శనివారం అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఘనంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఇబ్రహీంపట్నం: ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో ఎదుట జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు భాస్కర్ మాట్లాడుతూ ఎస్‌డబ్లూఎఫ్ ఆవిర్భావం నుంచి కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కంటే ముందు కార్మికుల ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సత్తయ్య, యాదయ్య, జంగయ్య, దిలీప్‌కుమార్, శ్రీహరి, ఎల్లేశ్, బుగ్గరాములు, పురుషోత్తం పాల్గొన్నారు.


జెండాను ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు

‘విజయభేరి’ విజయవంతం చేద్దాం

ఇబ్రహీంపట్నం: తుక్కుగూడలో ఆదివారం జరిగే విజయభేరి సభను విజయవంతం చేద్దామని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శేఖర్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై తిరుగుబాటు చేయాలన్నారు. అవినీతి, అక్రమాలకు నిలయంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన డిక్లరేషన్లను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు యేగిశ్వర్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఆమనగల్లు: తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్న విజయభేరి సభను విజయవంతం చేయాలని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. సభను విజయవంతం చేసి తెలంగాణ ఇచ్చిన ఏఐసీసీ నేత సోనియాగాంధీ రుణం తీర్చుకుందామన్నారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. రాష్ట్రాన్ని దోచుకుంటున్న సీఎం కేసీఆర్‌ను తరమికొట్టాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, నాయకులు కృష్ణనాయక్, వెంకటయ్య, శ్రీశైలం, పర్వతాలు, ఖాదర్, బాబా, సురేశ్‌నాయక్, అలీం, ప్రసాద్, ఖరీం, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్ పార్టీదే అధికారం

యాచారం: నేడు తుక్కుగూడలో నిర్వహించే విజయభేరి సభను జయప్రదం చేయాలని వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. యాచారం మండల కేంద్రంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏఐసీసీ నేత సోనియాగాంధీ రాకతో వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ దోపిడికి గురైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నల్లవెల్లి ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్, నాయకులు అమృతాసాగర్, అరవింద్‌నాయక్, రాజారెడ్డి, రవీందర్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ సభ్యులకు సన్మానం


ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సర్పంచ్

కడ్తాల్: నాలుగు రోజుల పాటు పోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించినందుకు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులను సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అభినందించి సన్మానించారు. ఈ మేరకు శనివారం పోచమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్‌తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులను సర్పంచ్ సన్మానించారు. అదే విధంగా బోనాల ఉత్సవాల సందర్భంగా పారిశుద్ధ్య నిర్వాహణ చేపట్టిన పంచాయతీ సిబ్బందిని కూడా సన్మానించారు. ఉత్సవాలను జయప్రదం చేసినందుకు ఉత్సవ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, సభ్యులు రాములు, మల్లేశ్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, కృష్ణయ్య, భూమయ్య, నాగార్జున్, పాండు, వెంకటేశ్, నర్సింహ తదితరులు ఉన్నారు.

మట్టి వినాయకుల పంపిణీ

ఇబ్రహీంపట్నం రూరల్: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పరమేష్ కోరారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మట్టి వినాయకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బబ్లీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజించండి

తుర్కయంజాల్: మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు మంగమ్మ కోరారు. శనివారం తుర్కయంజాల్‌లోని మారుతి లార్డ్స్ స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్కూల్ పిల్లలతో కలిసి పర్యావరణ పరిరక్షణకై ర్యాలీ నిర్వహించారు. అనంతరం గణపతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అర్జున్, లక్ష్మారెడ్డి, కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


మట్టి వినాయకులు అందజేస్తున్న పరమేష్

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

కడ్తాల్: ముఖ్యమంత్రి కేసీఆర్‌పర్యటన నేపథ్యంలో అడ్డంకులు సృష్టించవచ్చనే సమాచారంతో పోలీసులు బీజేపీ నాయకులను శనివారం ఉదయం ముందస్తు అరెస్ట్ చేసి, తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, నాయకులు సాయిలాల్ నాయక్, దశరథ్, విజయ్‌గౌడ్, మహేశ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ టీచర్లను, సిబ్బందిని కూడా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.


బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

అంగన్‌వాడీల ర్యాలీ

ఇబ్రహీంపట్నం: సమ్మెలో భాగంగా శనివారం ఇబ్రహీంపట్నంలో అంగన్‌వాడీలు ర్యాలీని నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజ్యలక్ష్మి, కిషన్, ఎల్లేశ్, బుగ్గరాములు, చందునాయక్‌లు పాల్గొన్నారు.

మొరం పోసిన వారిపై కేసు

హయత్‌నగర్: చెరువు శిఖం పరిధిలో మట్టిని పోసి పూడ్చేందుకు ప్రయత్నించిన వారిపై కేసు నమోదు చేసిన సంఘటన శనివారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో జరిగింది. కమిషనర్ రవిందర్‌రెడ్డి కథనం ప్రకారం మున్సిపాలిటీలోని ఫతుల్లాగూడ చెరువు శిఖం పరిధిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మట్టి(మొరం) పోసి పూడ్చుతున్నట్లు సమాచారం అందుకున్న మున్సిపాలిటీ అధికారులు శనివారం ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువును సందర్శించారు. శుక్రవారం రాత్రి సుమారు 30 ట్రిప్పుల మొరంను శిఖం పరిధిలో నింపినట్లు గుర్తించారు. దీంతో మొరం పోసిన వారిపై నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మొరం పోసిన వారిపై కేసు నమోదు చేశారు.

సీఎం కాన్వాయ్‌ని అడ్డుకునే యత్నం


సీఎం కాన్వాయ్‌ని అడ్డుకునేందుకు యత్నిస్తున్న బీజేవైఎం నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో సీఎం కేసీఆర్ కాన్వాయ్‌ని బీజేవైఎం నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని నిలువరించారు. కొల్లాపూర్ సమీపంలోని నార్లాపూర్ వద్ద పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించేందుకు హైదరాబాద్ నుంచి కేసీఆర్ బస్సులో వెళ్లారు. అయితే సీఎం కాన్వాయ్ ఆమనగల్లు పట్టణంలోకి ప్రవేశించగానే బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ప్రభాకర్, మరో ముగ్గురు యువకులు బీజేపీ జెండాలతో కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. సీఎం కేసీఆర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ప్రభాకర్, మరో ముగ్గురిని ఆమనగల్లు పోలీసు స్టేషన్‌కు తరలించారు.

బీజేవైఎం నేతలపై కేసు

కేసీఆర్ పర్యటనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన బీజేవైఎం నాయకులపై కేసులు నమోదు చేసినట్లు ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ బాల్‌రాంలు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని గ్రామీణ వికాస్ బ్యాంకు ఎదుట బీజేవైఎం నాయకులు ప్రభాకర్, శ్రీకాంత్, బాలకృష్ణ, శ్రీహరిలు అక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్‌లను తోసివేసి సీఎం కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించారని తెలిపారు. ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ కోసం రిలే దీక్షలు


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

యాచారం: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేస్తూ యాచారం మండల కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్ శ్రేణులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఎస్సీలను ఏబీసీడీలు వర్గీకరించపోతే వచ్చే ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు ఓటు ద్వారా గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ దీక్షలో నాయకులు మహేశ్, మంద లింగం, అజయ్, ప్రేమేశ్, కంబాలపల్లి రవి, రాజేశ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి జరిమానా


రశీదు అందజేస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి మునగనూర్‌కు చెందిన శ్రీ సౌమ్య ఆస్పత్రి యాజమాన్యం మురుగునీరును బహిరంగగా వదిలేస్తుండడంతో మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్ జరిమానా విధించారు. శనివారం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జరిమానా రసీదును ఆస్పత్రి యాజమాన్యానికి అందజేశారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పాడేసిన, మురుగు నీరు బహిరంగంగా వదిలిన చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని, పారిశుద్ధ్య నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

కానిస్టేబుల్‌కు డీసీపీ అభినందన


మహిళా కానిస్టేబుల్‌కు క్యాష్ రివార్డు అందిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

ఆమనగల్లు: సీఎం కాన్వాయ్‌ను అడ్డుకోబోయిన బీజేవైఎం నాయకులను నిలువరించిన మహిళా కానిస్టేబుల్‌లను శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి అభినందించారు. ఆమనగల్లు పట్టణంలో సీఎం కేసీఆర్ కాన్వాయ్ వెళ్తున్న సమయంలో బీజేవైఎం నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. అక్కడే విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు అపర్ణ, రమాదేవీలు వారిని నిలువరించి, కాన్వాయ్ సాఫీగా సాగేందుకు కృషి చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుళ్లు అపర్ణ, రమాదేవిలను డీసీపీ నారాయణరెడ్డి అబినందించి క్యాష్ రివార్డు అందజేశారు. ఇందులో షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ బాలరాంలు ఉన్నారు.


న్యాయశాఖ కార్యదర్శికి శుభాకాంక్షలు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శిగా నియమితులైన తిరుపతికి ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి శాలువ కప్పి సత్కారించారు. ఈ సందర్భంగా పట్నానికి అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి కోర్టును మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌గౌడ్, న్యాయవాదులు సిహెచ్ రవి, సాయికుమార్‌లు పాల్గొన్నారు.

హామీలను నిలబెట్టుకోవాలి

ఇబ్రహీంపట్నం: అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ఇబ్రహీంపట్నంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే అధికారికంగా సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరుపుతామని బీఆర్ఎస్ పాలకులు ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని బీజేపీ నాయకులు మండిపడ్డారు. ఈ బైక్ ర్యాలీ పట్టణంలోని పురవీధుల్లో పెద్ద యేత్తున సాగింది.

మంచిరెడ్డికి సన్మానం


మంచిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కందుకూరు: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వెళ్తున్న ఆయన మధ్యలో కందుకూరులో ఆగగా స్థానిక నాయకులు శాలువాతో సత్కరించారు. బీఆర్ఎస్ నాయకులు సామ మహేందర్‌రెడ్డి, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, శ్రీధర్, రాజు, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.